క్లుప్తంగా

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట



పెంట్లవెల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని కర్ణాటక ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటలో అమలవుతున్న 5 పథకాలు తెలంగాణలో అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు.కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ సీఎం అసత్యప్రచారాలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట్ల సురేందర్, ఖాజామైనోద్దీన్, రామన్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, ఆసీఫ్, నరేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

- పెద్దకొత్తపల్లి మండల వెన్నచర్లలో ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్ ఓటర్లకు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు.
- పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల, మారేడుమాన్‌దిన్నె గ్రామాల్లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
- పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఎంపీటీసీ ఈశ్వరికుమారి, కురుమయ్య, మూర్తి, నర్సింహ, రాముడు తదితరులు పాల్గొన్నారు.
- పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్, జొన్నలబొగుడ, చంద్రకల్, కల్వకోలు, మారేడుమాన్‌దిన్నె గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు.
- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, కాంగ్రెస్ నాయకుల అహంకారానికి మధ్య జరుగుతున్న ఎన్నికలుగా ఓయూ విద్యార్థి నేత మారేడు ఈశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 55 సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో ఏ రోజు కూడా రైతుల, మహిళల గురించి ఆలోచించలేదన్నారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, ఉపేందర్, ప్రవీణ్, నరేష్, చందు, శంకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.
- తెలకపల్లి మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తపల్లి కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో ఆయనకు స్వాగతం పలికారు. పృథ్వీరాజు, మహేష్, రెడ్డపాకుల శివశంకర్, బాలనాగయ్య, మొగులాల్, గోపాల్ పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ఆయనకు మద్దతుగా నాయకులు ప్రచారం చేశారు.
- ఉప్పునుంతల మండలం దేవదారికుంట తండా, గుట్టమీదితండా తిర్మలాపూర్, కంసానిపల్లి, జెప్తీసదగోడు, మొల్గర తదితర గ్రామాల్లో అచ్చంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా దోమలపెంటలో ఎమ్మెల్యే గువ్వలకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానన్నారు. మనోహర్, భూపాల్‌రావు, శ్రీకాంత్ బీమా, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.
- తెలకపల్లిలో బీజేపీ, జనసేన అభ్యర్థి వంగ లక్ష్మన్‌గౌడ్ ప్రచారం నిర్వహించారు. గ్లాస్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ చట్టం మాదిరిగానే అగ్రకులాలు, బీసీల రక్షణ కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరుపై చట్టం తీసుకురావాలని ధర్మ సమాజ్ పార్టీ నాగర్‌కర్నూల్ శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి అరవిందాచారీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు కింది స్థాయి వర్ణాలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీఎస్పీ అధికారంలోకి వస్తే ప్రతి నెల కౌలు రైతులకు రూ.5వేలు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల తనిఖీలు



తాడూరు: మండలంలోని మేడిపూర్ దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పాయింట్ వద్ద అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని సోమవారం తనిఖీ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 50కి పైగా వాహనాలను తనిఖీ చేయగా ఎటువంటి నగదు, మద్యం పట్టుబడలేదని పేర్కొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



తెలకపల్లిలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మర్రి

తెలకపల్లి: బీఆర్‌ఎస్‌తోనే ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలకపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి మర్రిజమున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకుసాగారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఆదరిస్తే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారని మరింత అభివృద్ధి జరగాలంటే మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా సొంత ఖర్చులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అన్ని గ్రామాలు అభివృద్ధి జరిగాయని రైతు బీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధుతోపాటు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ అమలు అవుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల తీసుకొచ్చానని పేర్కొన్నారు. పేదలకు సామూహిక వివాహాలు, రూ.5 కే భోజనం ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. తెలకపల్లి ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సాయంత్రం గోలగుండం, లక్నారం గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ కొమ్ము మధు, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తాడూరులో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యార రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు.

చిత్తశుద్ధితో హామీలు అమలు చేస్తాం



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు గ్యారంటీల హామీలను విడుదల చేశారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహలక్ష్మి, యువతకు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాల భర్తీకి ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కాంగ్రెస్ గెలుపును కానుకగా ఇవ్వాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు ఏమి చెప్పాలో తెలియక 8 నిమిషాల్లోనే ప్రసంగం పూర్తి చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు ఎక్కడ అందుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేరలేదన్నారు. ప్రజల సాక్షిగా ముఖ్యమంత్రి 90 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారని అబద్దాలు చెప్పడం బాధాకరమన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీరు రాలేదన్నారు. మండలంలోని లింగారెడ్డి గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.మండలంలోని మార్చాలలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన కల్వకుర్తి పరిశీలకురాలు సురేఖ ప్రచార చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఎన్నికల ప్రణాళిక..

కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధిస్తే నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలను పొందుపరుస్తూ ప్రత్యేక ఎన్నికల నియోజకవర్గ మేనిఫెస్టోను విడుదల చేశారు. వంద పడకల ఆస్పత్రి, పాలిటెక్నిక్ కళాశాల, ట్రామాకేర్ సెంటర్‌తోపాటు పలు కార్యక్రమాలను పొందుపర్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేసింది ఏమి లేదని విమర్శించారు. దొరల పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాహుల్, పలువురు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కొల్లాపూర్: సీఎం కేసీఆర్ ద్వారా తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు మౌలాలి ఆధ్వర్యంలో 150 మంది, చుక్కాయిపల్లి, కుడికిళ్ల చెందిన బీఎస్పీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో గత పాలకులు చేసిన అభివృద్ధి పనులను, తన హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. గతంలో ప్రజలను ఇబ్బందులు పెట్టిన నాయకులు మళ్లీ మీ ముందుకు వస్తున్నారని, వారిని ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, కాటం జంబులయ్య, పరశురాం తదితరులున్నారు.

ఇంటింటి ప్రచారం

బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాన రహదారుల వెంట తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, గాలియాదవ్, జాఫర్, రుక్మద్దీన్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన వైస్ ఎంపీపీ

కోడేరు: మండలంలోని తుర్కదిన్నెకు చెందిన వైస్ ఎంపీపీ కొత్త వెంకటేశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ద్వారానే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, రెండవ సారి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పాన్‌గల్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గౌరారం వెంకట్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ప్రచారం నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కల్వకుర్తిరూరల్: కార్తీకమాస తొలి సోమవారం పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని శివాలయంలో శివమాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో దాతల సహకారంతో శివస్వాములకు నిత్యాన్నదానం చేపట్టారు. శివస్వాములు, అయ్యప్ప స్వాములు, ఆంజనేయ స్వాములు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన కార్యదర్శిగా యశ్వంత్

మన్ననూర్: స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన నల్లవెల్లి యశ్వంత్‌ను ఎస్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, దాసరి కార్తిక్‌ను జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర పార్టీ తరుపున ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మండల నాయకులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు సామూహిక సత్యసాయి వ్రతాలు

కందనూలు: భగవాన్ సత్యసాయి బాబా 98 జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని సత్య సాయిబాబా మందిరంలో ఉదయం10.30 గంటలకు సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతానికి కావలసిన పూజా సామాగ్రిని భక్తులు తీసుకొని రావాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



తాడూరు: మండలంలోని గుట్టలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె సిబ్బంది లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12 లీటర్ల సారా పట్టివేత

అచ్చంపేట రూరల్: సారా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని దర్శన్‌గడ్డతండా ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌పై 12 లీటర్ల సారాను ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకునట్లు పేర్కొన్నారు. అందులో ఒకరు తప్పించుకొని వెళ్లారని పేర్కొన్నారు. సారా, బైక్‌ను స్వాధీనం చేసుకుని మహిళ బుజ్జిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్, సిబ్బంది ఆసిఫ్, ఉషారాణి పాల్గొన్నారు.



బీజేపీతోనే రాష్ట్రం సుభిక్షం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధాకర్‌రావు

పెంట్లవెల్లి: బీజేపీతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కొల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి పలువురు యువకులు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎల్లేని సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు యువకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

పాన్‌గల్: నియోజకవర్గ అభివృద్ధికి కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలని అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు తరపున సోమవారం మండలంలోని కేతేపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఇప్పటికే జాతీయ రహదారి, సోమశిల సిద్దేశ్వరం బ్రిడ్జి మంజూరు చేయించామని బీజేపీ అభ్యర్థిని ఆదరిస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్వేష్, రోజారమణి, రమేష్ పాల్గొన్నారు.


ఓటర్ చీటీలను త్వరగా పంపిణీ చేయండి

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాలలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపయోగించే ఓటర్ చీటీల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని తహసీల్దార్ వరలక్ష్మి ఆదేశించారు. మండలంలో మొత్తం 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అందుకు సంబంధించి ఆయా గ్రామాలలోని ఓటర్ స్లిప్పులను బీఎల్ఓలకు అందజేశామని తెలిపారు.

బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన

ఉప్పునుంతల: స్థానిక కేజీబీవీలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో బాలికలపై జరుగుతున్న ఆకృత్యాలు, పిల్లల సాధికారికత, ఆరోగ్య భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాటలు, ఉపాన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అమృత, మల్లేష్, వైద్యాధికారిణి సంధ్య తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మల్లురవి

అచ్చంపేట: హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం అయ్యారని మాజీ ఎంపీ మల్లురవి, డీసీసీ అధ్యక్షుడు డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గువ్వల ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోశం గణేష్, జి.రాజేందర్, కొడూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అచ్చంపేటలో బహిరంగ సభ..

అచ్చంపేట: నాగర్‌కర్నూల్, అచ్చంపేటలో ఈ నెల21న భారీ బహిరంగ సభలు నిర్వహిస్తునట్లు పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, పీసీసీ జనరల్ సెక్రెటరీ సభ అబ్బర్వర్ భవాని, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం సభకు సంబంధించిన ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం రహదారిలోని వైజంక్షన్ సమీపంలో సభ ఏర్పాట చేశామని, మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి హాజరవుతారని తెలిపారు.

కందనూలు: బిజినేపల్లిలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోడిదేల రాము కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి నివాసంలో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అరాచకాలకు వ్యతిరేకంగా రాబోయే ఎన్నికల్లో తీర్పు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దానం బాలరాజ్, వారణాసి శ్రీనివాస్, జయకృష్ణ, ఎండీ జిలాని, వరుణ్ కుమార్, శ్రీకాంత్,శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



తాడూరులో మాట్లాడుతున్న రాజేష్‌రెడ్డి

తాడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అదేవిధంగా తాడూరుతో పాటు ఇంద్రకల్, బలాన్‌పల్లి, పోలుమూరు, ఆకునెల్లికుదురు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు, జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ రేణుక, నాయకులు ఇంటింటికి తిరిగి ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. రాజేష్‌రెడ్డిని ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నిరంజన్, మల్లయ్య, వెంకటయ్య, రాములు, కోటీశ్వర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని గట్టురాయిపాకులలో సీపీఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌రెడ్డి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం. 500లకే గ్యాస్ సిలిండర్‌తోపాటు ఆరు గ్యారంటీలు అమలు అవుతాయని వివరించారు. నారాయణగౌడ్, పర్వత్‌రెడ్డి, సీపీఐ నాయకులు కేశవులుగౌడ్, రవి, రవీందర్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గౌరారంలో సోమవారం రాత్రి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాల పరిశీలన



మల్లాపూర్ చెంచుపెంటలో ఎన్నికల అధికారి సతీష్ కుమార్ తదితరులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మల్లాపూర్, సార్లపల్లి, ఫరహాబాద్ చెంచు పెంటల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రం భవనాలను నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకుడు సతీష్ కుమార్ పరిశీలించారు. సోమవారం ఆయా కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఆయన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయవలసిన వసతులపై అధికారులతో చర్చించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఇంటి వద్ద లేని వారికి పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రం వద్ద అందజేయాలన్నారు. ఈవీఎంల నిర్వహణ, భద్రత తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఐటీడీఏ అధికారి జాఫర్ హుసేన్, డిప్యూటీ తాహసీల్దార్, ఆర్ఐ కృష్ణజీ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ నర్సింహారెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు శాఖా పనితీరులపై సమీక్షించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారాలకు కృషి చేస్తామని ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ఎంపీడీఓ కోటేశ్వర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ గిరిధర్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న మిత్రమండలి సభ్యులు

అచ్చంపేట రూరల్: దివంగత డాక్టర్ గిరిధర్ వైద్య సేవలు మరువలేనివని మిత్రమండలి అధ్యక్షుడు మండికారి బాలాజీ అన్నారు. సోమవారం అచ్చంపేటలో గిరిధర్ 9వ వర్ధంతిని మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యుడు శ్రీనివాసులు, విశ్వేశ్వర్, కాశీలింగం, రమేష్, శేఖర్, ఉషారాణి, పాండు, రవీందర్, భరత్‌చారి పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అమ్రాబాద్: బాలలహక్కులు పరిరక్షించడం అందరి బాధ్యత అని ఎంఈఓ బాలకిషన్, ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లల హక్కులు, రక్షణ అనే అంశంపై వ్యాస రచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం బాలల హక్కులను పరిరక్షిస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ కన్వీనర్ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



సంగినేనిపల్లిలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సమాఖ్య అధికారులు

వీపనగండ్ల: రైతులు పండించిన వరి ధాన్యాన్ని మండల మహిళా సమాఖ్య ద్వారా గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఏపీఎం బిచ్చన్న రైతులను కోరారు. సోమవారం సంగినేనిపల్లి, బొల్లారం ఇతర గ్రామాలలో మహిళా సంఘ సభ్యులు, రైతులతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని విక్రయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ మాధవస్వామి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని ఐకేపీ సీసీలు నాగరాజు, స్వామి, ధనలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని రాయినిపల్లి, కేతేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు.